సమర్థ సద్గురు శ్రీ భరద్వాజ మాస్టరుగారి లీలావైభవం – 1



అంకితము: శ్రీ భరద్వాజ మాస్టర్ గారి పాదపద్మములకు

వాసుదేవుని సంకీర్తనముగాని, కథా సన్నివేశములుగాని వినుచు తన జీవితము ఏ పుణ్యాత్ముడు గడపునో, వాని ఆయువే నిజమైన ఆయువు. విష్ణు స్మరణ యందు విష్ణువుండును గనుక అది విష్ణువు జీవించిన ఆయుష్కాలము. మిగిలినవారి ఆయుర్దాయములను సూర్యోదయ సూర్యాస్తమయ రూపములుగా సూర్యుడు మోసముచేసి అపహరించును. - మాస్టర్ ఇ.కె.

శ్రీ భరద్వాజ మాస్టర్ సుబ్బరామయ్య గారితో వెంకయ్య స్వామి లీలలు ముద్రించి భక్తులకు ఇవ్వు. ఆ పుస్తకాలు ఎక్కడ చదువుతారో అక్కడంతా సత్సంగం చేసినట్లు అని చెప్పారు. సుబ్బరామయ్య సార్ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్య స్వామి గురించే గాక ఎందరో మహనీయుల జీవిత చరిత్రాలు, లీలలు ముద్రించి భక్తులకు అందజేశారు. సాక్షాత్తు భగవంతుడైన శ్రీ భరద్వాజ మాస్టర్ గారి దివ్య లీలలు telegram అనే మొబైలు అప్లికేషన్ లో "సమర్థ సద్గురు శ్రీ భరద్వాజ మాస్టరుగారి లీలావైభవం" అనే చానెల్ లో వచ్చాయి. వాటిల్లో కొన్నింటిని ఇక్కడ సంకలనం చేసి మా సమయాన్ని సద్వినియోగం చేసుకుందామని, ఈ లీలలు చదివిన వారి సమయం సద్వినియోగం, పావనము అవుతుందనే ఉద్దేశ్యంతో పుస్తక రూపంలో ప్రచురిస్తున్నాము. - శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్

సేకరణ మరియు పర్యవేక్షణ:
శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ సభ్యులు
ప్రాప్తిస్థానము:
శ్రీ సాయిమాస్టర్ సేవా ట్రస్ట్,
గొలగమూడి, నెల్లూరు జిల్లా – 524321

వెల: శ్రీ భరద్వాజ మాస్టర్ గారి దివ్య లీలలు చదివి పులకించి తరించటమే!

ఒంగోలుకు చెందిన శ్రీ తీగల శ్రీకాంత్

ఒక పదేళ్ల క్రితం వరకు బాబా గురించి నాకు ఏమాత్రం అవగాహనే లేదు. పైగా శ్రీరాముడు అంటే (ఆయన రూపం) మాత్రమే ఇష్టంగా వుండేది. బాబాను చూస్తే చిరిగిన బట్టలు వేసుకొనే ఒక ముసలాయన అనిపించేది. ఒకసారి మాకు తెలిసినవాళ్ళు ఇల్లు మారుతున్నారు. వాళ్ళకి సహాయము చేద్దామని వెళ్ళాను. వాళ్ళింట్లో 'శ్రీ సాయి లీలామృతం' గ్రంథం చూశాను. అలా..అలా.. కొన్ని పేజీలు తిరగేసాను. రచనా శైలి నాకు నచ్చి 'మంచి రచయిత!' అనుకున్నాను.

కొన్నాళ్ళకు మా ఇంటి దగ్గర ఒక ఆవిడ నాకు 'శ్రీ సాయి లీలామృతము' గ్రంథము ఇచ్చారు. మొహమాటానికి తీసుకున్నాను. ఒకసారి శ్రద్ధగా పారాయణ చేసాను. ఫలితంగా నాకు చాలా ఆనందంగా, ఆహ్లాదంగా అనిపించింది. ఆ గ్రంథంములో 'శ్రీ గురుచరిత్ర' గురించి ప్రస్తావన వుండటం చూశాను. అదీ నా మొట్టమొదటి పారాయణ అనుభవము.

ఒకసారి కలలో .... తిరుపతిలో ఒక పెద్ద ఖాళీ స్థలములో దత్త భజన జరుగుతోంది. అక్కడ ఒక పెద్దావిడ అచ్చు అమ్మవారిలా వున్నారు. ఆవిడ నాకు ఒక లడ్డు ఇచ్చి, "నువ్వు దత్తుడికి కూడా దణ్ణం పెట్టాలి!" అన్నారు. "నేను దణ్ణం పెట్టను!" అన్నాను. ఆమె,"ఆయన ఇచ్చే లడ్డూ తీసుకుంటావు కానీ, దణ్ణం పెట్టావా?" అన్నారు..... ఆ స్వప్నం ముగిసింది.

ఒక గురుపూర్ణిమ రోజున నేను ఇంటిదగ్గర బయలుదేరి బయటకు వెళదామని బైక్ మీద వెడుతుంటే సరిగ్గా ఒంగోలులోని బాబా గుడి దగ్గరకు రాగానే పెట్రోల్ ఓవర్ ఫ్లో అయ్యి బండి ఆగిపోయింది. అక్కడ ఒకావిడ ఎదురై నువ్వు గురుచరిత్ర చదివావా?" అనడిగారు. నాకు చదవడం ఇష్టం లేక నా దగ్గర ఆ గ్రంథం లేదన్నాను. ఆవిడ వెంటనే నాకు ఆ గ్రంథాన్ని ఇచ్చారు. సరే .. మొహమాటానికి తీసుకున్నాను.

ప్రతి సంవత్సరము గురుపూర్ణిమ రోజున బాబా గుడిలో పాదాలు తాకనిస్తారు. నేను గుడిలోకి వెళ్లి బాబా పాదాలకి నమస్కారము చేసుకొని వచ్చి కూర్చొని యధాలాపముగా 15 నిమిషాలు శ్రీ గురుచరిత్ర గ్రంథం తిరగేసాను. ఆ రోజు గుళ్లో ఆ గ్రంథంమీద చర్చ జరుగుతున్నది. ఆ గ్రంథం గురించి

కొంతమంది కొన్ని ప్రశ్నలు అడిగితే మరి కొందరు సమాధానాలు చెపుతున్నారు. చిత్రంగా వాళ్ళు అడిగే ప్రశ్నలన్నింటికీ నాకు సమాధానాలు ప్రయత్నం లేకుండానే వచ్చేస్తున్నాయి. సరిగ్గా పారాయణ చేయకపోయినా సమాధానాలు దొరకటం ఎంతో ఆశ్చర్యమనిపించింది.

తరువాత ఒకసారి శ్రద్ధగా 'శ్రీ గురుచరిత్ర' గ్రంథం పారాయణ చేశాను. వెంటనే కొన్నిరోజులపాటు అన్నిట్లో, అంతటా బాబానే వున్నారన్న భావము కొనసాగుతూ వుండేది. "శ్రీ గురుచరిత్ర పారాయణ చేస్తే మన గురువు మనకు తెలియబడతారు" అని రాసి వుంది కదా, నా గురువెవ్వరో నాకు తెలుసుకోవాలన్న ఉద్దేశ్యముతో 'శ్రీ గురుచరిత్ర ' పారాయణ చేయడం మొదలుపెట్టాను.

నిజానికి నాకు బాబా మీదే ఇంకా పెద్దగా భావము లేదు. పూజ్యశ్రీ మాస్టరుగారు నా ఊహలోనే లేరు, వున్నా ఆయన ఒక రచయిత. అంతే! ఎప్పుడూ ఒంగోలులోని బాబా గుడికి వెళ్లినా బాబా దర్శనం చేసుకొని వచ్చేవాడినే కానీ మాస్టరుగారి సమాధి మందిరానికి ఏ రోజు వెళ్ళలేదు.

కానీ నా గురువెవ్వరో తెలుసుకోవాలన్న తపనతో 'శ్రీ గురుచరిత్ర' పారాయణ తీవ్రంగా చేస్తున్నాను. 4 లేక 5 సార్లు పారాయణ పూర్తిచేసాను. అయినా గురువు గురించి ఎటువంటి నిరూపణా దొరకలేదు. అప్పుడు మాత్రం నా గురువెవ్వరో తెలియలేదని చాలా బాధపడ్డాను. ఒకరోజైతే విపరీతముగా ఏడ్చాను కూడా!

అదేరోజు మధ్యాహ్నం ఒక స్వప్నం వచ్చింది. ..... అది గుంటూరులో నల్లపాడులో వున్న శివాలయము. నేను MBA పరీక్షలకు గుంటూరుకి వెళ్ళినప్పుడల్లా ఆ గుడికి వెళుతుండేవాడిని. స్వప్నంలో యధాప్రకారం ఆ శివాలయానికి వెళ్లి నమస్కారం చేసుకుంటున్నాను. పానపట్టము మీద బాబా కూర్చొని వున్నారు. ఎంత అందముగా వున్నారంటే ....ఇన్నాళ్లు రాముడే అందగాడు అనుకున్నాను కదా! ఇప్పుడు ఈయన ఎంత అందగాడో నాకు చూపించారు! పచ్చని బంగారురంగు మేని ఛాయ, కాషాయ వర్ణం వస్త్రాలు వేసుకున్నారు. మిల మిల మెరిసి పోతున్నారు. ఆయన కిళ్ళీ నములుతున్నారు. పెదవులు ఎర్రగా వున్నాయి. పెదవుల పక్కనుంచి ఎర్రని రసం (తమలపాకులు నమిలినది) కారుతూ వుంది. ఎంత అందంగా వున్నారంటే వారి నుంచి నా

దృష్టిని తిప్పుకోలేక పోతున్నాను. నాకు బాగా ఏడుపొచ్చింది. వారి దర్శనంతో నా హృదయమంతా ఆనందంతో నిండిపోయింది. ఆ ఆనందం భాష్పాలుగా మారి బయటకి ఉబికి వస్తోంది. నా కళ్ళవెంట నీళ్లు రావటం చూసి ఆయన "ఎందుకేడుస్తున్నావురా పిచ్చోడా!" అని కుడిచేతితో 'శ్రీ సాయి లీలామృతం' గ్రంథం నా చేతిలో వేశారు. నేను గర్భ గుడి బయట నిలబడి వున్నాను. ఆయన శివలింగం స్థానంలో లోపల కూర్చొని వున్నారు. ఎడమచేతిని ఒక వైపు చూపించి, "ఈయన నీ గురువు రా!" అన్నారు. ఆయన చూపించిన వైపు చూస్తే తెల్లటి వస్త్రాలు ధరించి (లుంగీ,షర్ట్) పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు నందికి పక్కనే నిలబడి బాబా వైపే తదేకంగా చూస్తున్నారు. అక్కడ ఇంకా చాలా గ్రంథాలు వున్నాయి. అవన్నీ శ్రీ మాస్టరు గారు వ్రాసినవి. వాటిని బాబా నాకు చూపించి, "ఇవన్నీ చదవాలి రా! " అన్నారు. స్వప్నం ముగిసింది.

ఆ విధముగా సాక్షాత్తూ శ్రీ సాయినాథులే పూజ్యశ్రీ మాస్టరుగారే నా గురువని సూచించారు. తరువాత పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన గ్రంథాలన్నీ చదివాను.

ఒకరోజు ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి దర్శనానికి వెళ్ళాను. మాస్టరుగారే నా గురువని తెలిశాక మొదటిసారి ఆయన సమాధి దర్శనానికి వెళ్ళినప్పుడు అక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారికి అష్టోత్తర పూజ జరుగుతున్నది. అది వింటుంటే నాకు పారవశ్యము కలిగి కళ్లవెంట ధారాపాతంగా నీళ్లు కారుతున్నాయి. నా షర్ట్ చాలా వరకు కన్నీళ్లతో తడిసిపోయింది. అలా అరగంట సేపు జరిగింది. మొట్టమొదటిసారిగా నా గురుసన్నిధి నాకంతటి ఆనందాన్నిచ్చినది.

ఇక వారి మార్గదర్శకంతో నా జీవిత ప్రయాణం సాగుతున్నది. ఆ ప్రయాణంలో ఒక అపురూపమైన అనుభవాన్ని మీతో పంచుకుంటాను.

నాకు అరుణాచలం వెళ్లాలని చాలా తపనగా వుండేది. చాలాసార్లు 2,3 ఏళ్ళ పాటు ప్రయత్నం చేసినా వెళ్లడం కుదరలేదు. ఒకసారి తిరుపతిలో 'శ్రీవారి సేవ' కు వెళ్లి అక్కడ నుంచి అరుణాచలం వెడదామని కొండ దిగి క్రిందికి వచ్చేసరికి తీవ్రంగా జ్వరము వచ్చేసింది. ఇక వెనక్కి ఇంటికి వచ్చేశాను. ఇలా జరుగుతుండేది.

ఒకసారి శ్రీ రమణ భగవాన్ చరిత్ర లో వున్న ఒక వాక్యం నన్ను బాగా కదిలించింది--- "ఈశ్వరుని ప్రత్యేక అనుగ్రహం వుంటేనే తప్ప అరుణాచలంలో ఎవరూ కాలు పెట్టలేరు!" అని వ్రాసి ఉంటుంది. అది చదివాక ఎందుకో ఆ రోజు నాకు చాలా బాధ కలిగింది-- 'అంటే నాకు ఈశ్వరుని అనుగ్రహం లేకే కదా ఇన్నిసార్ల నుంచి వెళ్లలేక పోతున్నాను!' అనుకున్నాను. ఆ బాధలో పూజ్యశ్రీ మాస్టరుగారి పటం ముందు కూర్చొని బాగా ఏడ్చాను. గుండెల్ని పిండేస్తుంది ఆ బాధ. తట్టుకోవడం నా వల్ల కాలేదు. వెంటనే మా అమ్మతో ఈ విషయం చెప్పి, "నేను అరుణాచలం బయలుదేరతాను" అన్నాను. అప్పుడు అమ్మ "ఇప్పుడు డబ్బులు కూడా ఎక్కువ లేవు, ఎలా వెళతావు? ఒకసారి ఆలోచించు!" అన్నారు. అయినా సరే, ఇంట్లోవున్న డబ్బులు తీసుకొని మర్నాడు అరుణాచలానికి బయలుదేరాను.

నాకు ఎక్కడ దిగాలి, ఏవేమి చూడాలి ఏమీ అంచనా లేదు. నేరుగా అన్నామలై గుడికి వెళ్ళాను. అక్కడ వుండే వాళ్ళని ,"ఇక్కడ ఏమైనా రూములు దొరుకుతాయా?" అని అడిగాను. ఇలా అడుగుతుంటే ఒకతను వచ్చి గుడిదగ్గర ఒక రూమ్ ఇప్పించాడు. తన పేరు రాజు అని చెప్పాడు. స్నానం చేసి సిద్ధంగా వుంటే అతను వచ్చి అన్నామలై గుడికి తీసుకువెళ్లాడు. మేము గుళ్ళోకి వెళుతుంటే మాకు ఎదురుగా ఉత్సవ విగ్రహాలు వచ్చాయి. అతను వారిని ఆపి నన్ను నమస్కారము చేసుకోమన్నాడు! నేను కంగారుపడి ఆపొద్దు అన్నట్లుగా చెప్పాను. అతను, "ఏమి పరవాలేదు, నమస్కారం చేసుకో!" అన్నాడు. అలాగే చేసుకున్నాను. నన్ను గర్భ గుడి వద్దకు తీసుకొని వెళ్లి దర్శనం చేయించి, అక్కడ ఎంతసేపైనా కూర్చోవచ్చని చెప్పాడు. సరేనని 45 ని. పాటు అక్కడే కూర్చొని బయటకి వచ్చేశాను. తరువాత అభిషేకం టికెట్ తెచ్చి అభిషేకం చేయించాడు. తరువాత ఇద్దరం కలసి టిఫెన్ చేశాము. మర్నాడు పొద్దున్న 5 గంటలకు సిద్ధంగా వుంటే గిరిప్రదక్షిణకు తీసుకెడతానన్నాడు కానీ మర్నాడు అతను రాలేదు. కొంతసేపు వేచిచూసి నేను బయలుదేరి వెళ్ళిపోయాను. తిరిగి వచ్చిన తరువాత గుడి దగ్గర 'రాజు' గురించి అడిగితే అక్కడ ఎవరూ అలాటి వారు లేరన్నారు! అది నేను అంతగా పట్టించుకోలేదు. వీళ్లకు తెలిసివుండక పోవచ్చు అనిపించింది. 'నిన్న అన్నీ నాకు చూపించినందుకు డబ్బులు తీసుకోవడానికి

ఎటూ వస్తాడులే!' అని నేను అక్కడనుంచి గదికి వచ్చేశాను. కానీ అతను మళ్ళీ నాకు కనిపించలేదు!

తరువాత కాసేపటికి రమణాశ్రమానికి వెళ్ళాను. అక్కడ కూర్చొని ఆలోచించుకుంటున్నాను 'ఇక తిరుగు ప్రయాణం అవ్వాలి. వెళ్ళడానికి చార్జీలు తప్ప డబ్బులు అయిపోయాయి. ఇక్కడ ఇంకా వుండాలని అనిపిస్తుంది, కానీ ఉండలేని పరిస్థితి!'.. ఇలా ఆలోచిస్తూ వుండగా అక్కడ పనిచేస్తున్న వాచ్-మాన్ నా దగ్గరకు వచ్చి, "ఎక్కడ దిగారు?" అని వివరాలు అడిగి, "రమణాశ్రమంలో వుంటారా?" అన్నాడు. "అసలు ఇక్కడ గదులు అద్దెకు ఇస్తారా?" అని అడిగాను. " ఇస్తారు", అని, అతను నాకు ఒక వైద్యుని పేరు చెప్పి, "ఈ వ్యవహారాలన్నీ ఆయనే చూస్తారు, వెళ్లి కలవండి!" అని చెప్పాడు. నేను వారిని కలసి, "రూమ్ ఇస్తారా?" అని అడిగాను. ముందుగా బుక్ చేసుకోలేదు ఎందుకని అడిగారాయన. నేను అనుకోకుండా వచ్చానని చెప్పాను. "అసలిక్కడికి ఎందుకు వచ్చారు?" అని అడిగారు. "భగవాన్ చరిత్ర చదివాక వెంటనే రావాలనిపించింది, వచ్చేశాను!" అని చెప్పాను. కాసేపు నా వైపు చూసి నాకు ఒక గది ఇచ్చారు. అక్కడ గదులలో వుండేవారికి భోజన ప్రసాదం ఉచితం. ఆ రకంగా నా గురుదేవులు ఇంకొన్ని రోజులు అక్కడ వుండే అవకాశాన్ని నాకు ప్రసాదించారు.

నేను ఆ డాక్టరుగారిని Inner Path Pradakshina (గిరి పాద ప్రదక్షిణ) చేయించమని అడిగాను. అది ఎవరైనా తెలిసిన వారి ద్వారా చేయాలట. ఆయన రెండు మూడు సార్లు నన్ను తిప్పించుకొని ఒకాయన అడ్రస్ ఇచ్చారు. ఆయన నాకు పాద ప్రదక్షిణ లోని ప్రతి అంగుళం చూపించారు! "కొండపైకి వెళ్లిన వాళ్లకు పుట్టుక వుండదు. కానీ నడవడం చాలా కష్టం!" అన్నారు. నేను, "పరవాలేదు వెళదాం!" అన్నాను. నిజంగానే అక్కడికి చేరేసరికి బాగా ఆయాసం వచ్చి ఊపిరి పీల్చుకోవడం కష్టమనిపించింది. చనిపోతానేమో అనుకున్నాను. నా పరిస్థితి ఆయనకు చెపితే " 'అరుణాచలశివా..' అని 5 సార్లు అనుకో, తగ్గిపోతుంది!" అన్నారు. నేను అలా అనుకోగానే మాములుగా అయిపోయాను. తరువాత కొండదిగి ప్రదక్షిణ పూర్తి చేసుకున్నాను.

మర్నాడు మదురైనుంచి వచ్చిన ఒకతనితో పరిచయమైంది. మాటల్లో అతను నాతో, "నేను రమణాశ్రమంలో గదికోసం చాలాసార్లు ప్రయత్నం

చేశాను, దొరకలేదు. మీకెలా దొరికింది?" అనడిగాడు. నేను మొదట నేను అక్కడకు వచ్చిన దగ్గర నుంచి జరిగిన విషయాలన్నీ అతనితో వివరంగా చెప్పాను. నేను చెప్పిన విషయాలన్నీ విన్న తరువాత అతను, "నీకు గురువున్నారా?" అనడిగాడు. వున్నారని, పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి చెప్పాను. అతను, "నీ గురువు సామాన్యుడు కాదు. ఆయన అనుగ్రహవర్షం నీ మీద కురిపిస్తున్నారు. ఆయన చేయి ఎప్పుడూ వదలకు!" అన్నాడు.

చాలారోజులు అరుణాచలం వెళ్లాలన్న తపన నాలో కలిగించి, తరువాత వెళ్లే అవకాశాన్ని కల్పించి, దగ్గరుండి నా చేయి పట్టుకొని అక్కడ నేనేం పొందాలో అవన్నీ నాకు అనుగ్రహించి, తృప్తిగా యాత్ర చేయించిన నా గురుదేవుల పాదపద్మములకు అనంతకోటి ప్రణామములు.

హైదరాబాదుకు చెందిన రాగలత

నేను 2010 వ సం//లో విద్యానగరులో B.Tech చదువుకున్నాను. చాలాసార్లు తపోవనం ముందునుండి వెళ్ళాను కాని లోపలికి వెళ్ళలేదు, వెళ్లాలని కూడా అనిపించలేదు. మా స్నేహితులు కొంతమందిని తపోవనం గురించి అడిగితే ఏమీ చెప్పలేదు.

ఒకసారి సెలవులకి కర్నూలు దగ్గర చింతకుంట అనే ఊరికి వెళ్ళాను. అది మా తాతగారి ఊరు. అక్కడ ఒక మాసపత్రిక చూశాను. అందులో పూజ్యశ్రీ మాస్టరుగారి ఫోటో వుంది. ఆయన గురించి కొంత వ్రాసి వుంది. అప్పుడు కొద్దిగా అవగాహన వచ్చింది. తరువాత BTech మూడవ సంవత్సరంలో GATE Coaching కోసం హైదరాబాదుకి వచ్చాను. RCIలో పనిచేసే రమేష్ గారు నాకు ' శ్రీ సాయి లీలామృతము' గ్రంథం ఇచ్చారు. శ్రీ సాయి లీలామృతము ఒకసారి చదివాక 2013లో విద్యానగరులోని తపోవనంలో మొట్టమొదటిసారిగా అడుగుపెట్టాను. నాకు చాలా ప్రశాంతంగా అనిపించింది. పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి తెలుసుకున్నాక ఆయన అందరి గురించి చాలా కష్టపడ్డారనిపించింది.

నేను హైదరాబాదులో కోచింగుకి వచ్చినప్పుడు ఒక స్వప్నం వచ్చింది. అది విద్యానగరులోని బాబా గుడి. నేను ఆ గుడికి వెళ్ళాను. పూజ్యశ్రీ మాస్టరుగారు బాబా విగ్రహం దగ్గర ఒక పక్కకి కూర్చొని వున్నారు. నన్ను చూడగానే చాలా ప్రేమగా నవ్వారు. నాతో ఏదో చెప్పారు గాని గుర్తులేదు.

శ్రీ సాయి లీలామృతము పారాయణ పూర్తిచేశాక నేను, నా స్నేహితురాలు, మా నాన్నగారు శిరిడి వెళ్ళాం. అక్కడ మందిరంలోనున్న ఇంతటి గొప్ప సద్గురువైన శ్రీ సాయినాథుని చరిత్ర వ్రాసిన పూజ్యశ్రీ మాస్టరుగారు గుర్తొచ్చి ఆయననే తలచుకుంటున్నాను. పూజారిగారు నన్నే పిలచి, సాయినాథుని మెడలోని పెద్ద గులాబీ మాల తీసి నాకు ఇచ్చారు. వెంటనే ఇది పూజ్యశ్రీ మాస్టరుగారి దయ అనిపించింది.

2017లో 'మహాత్ముల ముద్దుబిడ్డడు' గ్రంథం చదివాక మా కుటుంబసభ్యులందరితో కురువపురం వెళ్ళాను. అక్కడ రాత్రి నిద్ర చేశాము. తెల్లవారుజామున స్వప్నంలో శ్రీపాదశ్రీవల్లభులు నాకు దర్శనమిచ్చారు. ఆయన నన్ను ఒక ప్రదేశంలో కూర్చోమన్నారు. ఆయన కూడా నా ఎదురుగా కూర్చొని మా కుటుంబ సమస్యలన్నీ అడుగుతుంటే నేను చెబుతున్నాను. కొంతసేపటికి మెలుకువ వచ్చింది. వెంటనే అప్రయత్నంగా ఇది పూజ్యశ్రీ మాస్టరుగారి దయ అనిపించింది.

తరువాత కొన్నిరోజులకి శ్రీగురుచరిత్ర పారాయణ చేశాను. మా నాన్నగారికి ఆరోగ్యం అస్సలు బాగులేదు. కుటుంబంలో చాలా సమస్యలు వున్నాయి. అన్నీ చక్కబడాలనే సంకల్పంతో పారాయణ చేసుకొని, ఒక రోజు రాత్రి బాగా ఏడుస్తూ పడుకున్నాను. శ్రీగురుడు స్వప్నదర్శనమిచ్చి, "సరిగ్గా మూడురోజులు ఆగమ్మా, మీ సమస్యలు చక్కబడతాయి!" అన్నారు. ఆయన చెప్పినట్లుగానే మూడురోజుల తర్వాత కుటుంబ సమస్యలన్నీ చక్కబడ్డాయి. ఇది కూడా పూజ్యశ్రీ మాస్టరుగారి దయ వలననే జరిగింది.

ఎందుకిలా అంటున్నానంటే, నేను పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన గ్రంథాలు చదివినప్పుడల్లా ఇలాంటి అనుభవాలు ప్రసాదిస్తారు. శ్రీసాయిలీలామృతం, శ్రీగురుచరిత్ర ఈ రెండు గ్రంథాలు పారాయణ చేయడం చాలా ముఖ్యమని తెలుసుకున్నప్పటినుండీ విడవకుండా ప్రతిరోజూ ఉదయమే ఒక గంట అయినా పారాయణ చేసుకొనే బయటకు వెళ్తాను. ఆ పారాయణవల్లనే ఇంతమంది మహాత్ములు నన్ను అనుగ్రహిస్తున్నారని నా నమ్మకం.

ఒకసారి కలలో శ్రీ మాణిక్య ప్రభువు, ఆయననుంచి అక్కల్ కోట స్వామి, ఆయననుంచి పూజ్యశ్రీ మాస్టరుగారు --- యిలా ఒకరినుంచి ఒకరు మారి మారి చాలా సేపు దర్శనమిచ్చారు. ఈ విధంగా పూజ్యశ్రీ మాస్టరుగారు, తనకు, శ్రీ మాణిక్య ప్రభువుకు, శ్రీ అక్కల్ కోట స్వామికి తేడా లేదని నిరూపణ ఇచ్చారు.

పూజ్యశ్రీ మాస్టరుగారి కృప నాపై ఎల్లప్పుడూ ఇలాగే వర్షించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

ఓం శ్రీ దత్తాత్రేయాయ భరద్వాజాయ నమః!

హైదరాబాదుకు చెందిన శ్రీమతి సీతగారు

మా అమ్మ పేరు కుమారి. పూజ్యశ్రీ మాస్టరు గారు తనకి గురుతుల్యులు. మా అమ్మకి నేను, అన్నయ్య సంతానం. మా అన్నయ్య చనిపోయిన తరువాత కొంతకాలానికి మా అమ్మావాళ్ళకి పూజ్యశ్రీ మాస్టరుగారు పరిచయం కావడం, తద్వారా బాబా సంప్రదాయం మా ఇంట్లో కొనసాగడం జరిగింది. 1982 లో పూజ్యశ్రీ మాస్టరుగారు మా ఇంటికి వచ్చారు. ఎందుకో తెలియదు కానీ నాకు పూజ్యశ్రీ మాస్టరుగారంటే చాలా ఇష్టంగా వుండేది. అది మాములుగా ఇష్టం అని చెప్పలేను. ఆయన్ని అలా చూస్తూ వుండాలని అనిపించేది. అలా ఆయనను చూస్తూవుంటే విపరీతంగా ఆనందంగా వుండేది. ఇంట్లో అందరూ పూజ్యశ్రీ మాస్టరుగారు వచ్చినప్పుడు సత్సంగాలని, పూజలనీ హడావిడిగా వుండేవాళ్ళు. నేను మాత్రం ఏ పక్కనుంచో ఆయన్ని అలా చూస్తూ వుండేదాన్ని.

నేను తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడు ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు మా ఇంటికి వచ్చారు. ఆ రోజు ఉదయం 11 గంటల సమయంలో పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక్కరే మా హాలులో కూర్చున్నారు. అప్పుడు సత్సంగ సభ్యులెవరూ లేరు. మా అమ్మ భిక్ష తయారు చేస్తూ వంటింట్లో వుంది. పూజ్యశ్రీ మాస్టరుగారు ఎదురుగా బాబా ఫోటో వుంటే, దాని వైపే ఏకాగ్రతతో చూస్తున్నారు. నేను ఒక్కదాన్ని హాలులో కూర్చొని పూజ్యశ్రీ మాస్టరుగారి వైపే చూస్తున్నాను. కొంతసేపు తరువాత పూజ్యశ్రీ మాస్టరుగారు నా వైపు తిరిగి, "ఏమి కావాలమ్మా?" అని అడిగారు. ఆయన కళ్ళు ఎర్రగా వున్నాయి. నేను భయపడిపోయి సమాధానం చెప్పకుండా లోపలికి పరుగుతీసాను.

పూజ్యశ్రీ మాస్టరుగారు మా ఇంటికి చాలాసార్లు వచ్చారు. ఆయన మా ఇంట్లో వున్నంతసేపూ వాతావరణం చాలా ఆనందంగా వుండేది. నేను ఆయననే చూస్తూ ఆనందపడుతుండే దానిని !

పూజ్యశ్రీ మాస్టరుగారితో మేము యాత్రలకు కూడా వెళుతుండేవారము. నాకు 18 సంవత్సరాలకే ఫిబ్రవరి 9 వ తేదీన వివాహం జరిగింది. మాకు ఇద్దరు పిల్లలు--- ముందు ఒక పాప, తరువాత బాబు పుట్టారు. మా పాప పుట్టిన తరువాత నాకు ఒక కల వచ్చింది. ఒక పురాతన ఆలయంలో ఒక పెద్దావిడ ప్రసాదం పెడతాను రమ్మన్నారు. ఆ తరువాత నన్ను ఒడి పట్టమన్నారు. ఆడపిల్లకి సంబంధించిన వస్తువులన్నీ ఆమె నా ఒడిలో వేస్తున్నారు --- అంటే అద్దం, కాటుక, బొట్టు లాంటివి. ఇంతలో నేను పట్టిన కొంగు జారి అవన్నీ కింద పడిపోయాయి. ఆవిడ నన్ను కోప్పడి కొట్టడానికి సిద్ధపడింది. నేను ఆమెకు దొరకకుండా పరుగెత్తి పరుగెత్తి పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వచ్చాను. అక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారు సత్సంగము చేస్తున్నారు. అప్పుడు జరిగిన సంగతి చెప్పి, "నాకు భయమేస్తోంది మాస్టరుగారూ!" అంటే, "ఏమీ కాదులేమ్మా, మంచి బాబుని ఇస్తాను! " అన్నారు.

ఇంకోసారి కలలో చిన్ని కృష్ణుడిని చూపించారు. చాలా నల్లగా ఉన్నాడు. తరువాత నేను మా బాబుని కడుపుతో వున్నప్పుడు 8వ నెలలో నాకు chikenpox వచ్చి 104 డిగ్రీల జ్వరం వచ్చింది. తగ్గిన తరువాత డాక్టర్ పరీక్ష చేసి, బాబు లోపల బాగా ఉడికిపోయి వున్నాడు, ఆపరేషన్ చేసి తీసేస్తాము అన్నారు. కానీ సమయానికి నార్మల్ డెలివరీ అయింది. బాబు నల్లగా ఉన్నాడు. అందుకే కలలో అంతా నల్లగా చూపించారు అనుకున్నాను. మా బాబు పేరు అజయ్.

మా బాబుకి 14 వ సంవత్సరం వచ్చేసరికి ఎందుకో నాకు చాలా భయంగా వుండేది. వాడికి ఏదో కీడు జరుగుతుందనిపించేది. పైగా శ్రీ సాయిలీలామృతములోని రేగే అనుభవం గుర్తొచ్చేది. అలాంటి సమయంలో ఒక కల వచ్చింది. అందులో పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందారట. ఒక చెక్క బల్లపై ఆయన దేహాన్ని పడుకోబెట్టారు. ఆయన ఒక్కసారిగా విదిలించుకుని లేచి కూర్చొని అక్కడే వున్న నన్ను చూసి కళ్ళతో సైగ చేశారు. నాకు భయం వేసి ఒక్క అడుగు వెనక్కి వేశాను. మళ్ళీ కొంతసేపటికి మళ్ళీ పిలిచారు. మళ్ళీ ఒక అడుగు వెనక్కి వేశాను. ఇక యిలా కాదని పూజ్యశ్రీ మాస్టరుగారు లేచి నిలబడి నా వైపు అడుగులు వేస్తున్నారు. అప్పుడు నేను వారి పాదాల మీద పడి, ఆయన పిలుస్తున్నా కూడా వెళ్లలేదని బాధపడుతూ నన్ను క్షమించమని అడుగుతూ ఏడుస్తున్నాను. ఆయన ప్రేమగా నా భుజాలు పట్టుకొని లేపుతూ, "వాయవ్యం

మూల రావి చెట్టును ప్రతిష్ట చేయమ్మా!" అన్నారు. ఆ కల వచ్చిన కొన్ని రోజులకు మా బాబుకి తీవ్ర అనారోగ్యం వచ్చింది.

చిత్రంగా ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు కలలో కనిపించి నాతో, "ఏమ్మా, అజయ్ కి స్నానం చేయించావా?" అని అడిగారు."లేదు మాస్టరుగారూ!"అన్నాను. మెలుకువ వచ్చాక ఎందుకిలా అడిగారా అనుకున్నాను. కాసేపటికి నా స్నేహితురాలైన డాక్టర్ రజని ఫోన్ చేసి, "తమిళనాడులో తిరునల్వేలీ దగ్గర జలపాతాలు వున్నాయట, అక్కడ స్నానం చేయిస్తే ఆరోగ్యం బాగుండొచ్చు!" అని చెప్పింది. అడుగు అడుగున పూజ్యశ్రీ మాస్టరుగారు మా గురించి తీసుకొనే శ్రద్ధకు కళ్ళు చెమర్చాయి. వెంటనే మా బాబును అక్కడికి తీసికెళ్ళి స్నానం చేయించాము. మా బాబుకు స్వస్థత చేకూరింది. అలా ఎన్ని సార్లు నేను పూజ్యశ్రీ మాస్టరుగారి నుంచి మేలు పొందానో, ఎన్నిసార్లు ఆయన నన్ను రక్షించారో నాకే తెలుసు.

ఈ మధ్య జనవరి నెలలో పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్నంలో కనిపించారు. అది నాగోలులాగా వుంది. నేను పూజ్యశ్రీ మాస్టరుగారి పక్కనే కూర్చొని ఆయననే చూస్తూ చాలా ఆనందాన్ని అనుభవిస్తున్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారు నావైపు చూస్తూ "ఏమ్మా?" అన్నారు! "నాకు చాలా ఆనందంగా వుంది మాస్టర్!" అని వారి పాదాలకు నమస్కారం చేసుకున్నాను. అక్కడ ఏదో వేడుకకి అనుకుంటా, పూలతో అలంకరణ చేస్తున్నారు. అబ్బాయిలు, సత్సంగ సభ్యులందరూ వున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా మధ్య మధ్యలో ఏదో పని మీద వెళుతూ తిరిగి అక్కడికి వచ్చి కూర్చుంటున్నారు. నేను మాత్రం వారినే గమనిస్తూ, చూస్తూ విపరీతమైన ఆనందాన్ని అనుభవిస్తున్నాను. నాకు చాలాసార్లు ఇదే విధంగా స్వప్నాలలో కనిపిస్తున్నారు. ఏ సందేశం లేకున్నా దర్శనాన్ని చాలాసార్లు అనుగ్రహించారు. ఎటువంటి పరిస్థితి ఎదురైనా ధైర్యముగా వుంటుంది. అలా పూజ్యశ్రీ మాస్టరుగారు దర్శనం ఇచ్చినప్పుడల్లా నాకు విపరీతమైన ఆనందం కలుగుతుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఆనంద స్వరూపులు..... !!

ఓం సచ్చిదానందాయ భరద్వాజాయ నమః!

హైదరాబాదులోని నాగోలుకు చెందిన శ్రీమతి సుప్రియగారు

2011 లో నా వివాహమైంది. అంతకుముందు నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు తెలియదు. పెళ్లయ్యాక మావారైన శ్రీకాంత్ గారు నాకు గురుకుటుంబం గురించి తెలిపి నన్ను శ్రీగురుచరిత్ర పారాయణ చెయ్యమన్నారు. నేను గురుపూర్ణిమకు కొద్దిరోజులముందు పారాయణ మొదలు పెట్టాను. చిత్రంగా శ్రీ గురుచరిత్రలో గాణ్గాపుర్, నర్సోబావాడి క్షేత్రాల గురించి చదువుతుంటే నాకు ఆ పవిత్రక్షేత్రాలను ఇంతకుముందే చూసినట్లనిపించేది! ఆ తరువాత కొంతకాలానికి ఆ క్షేత్రాలను దర్శించినపుడు నాకు పారాయణ సమయంలో నా మనసులో ఎలా అయితే ఇంతకుముందు చూసినట్లు కనిపించాయో ఆ క్షేత్రాలు అలానే వున్నాయి!

పారాయణ మధ్యలో గురుపూర్ణిమ వచ్చింది. ఆ ముందురోజు, ఆ రోజు, ఆ తరవాత రోజు నాకు ఒకే కల వచ్చింది! ఆ స్వప్నంలో దత్తాత్రేయుని వేషధారణలో వున్న ఒక వ్యక్తి మా ఇంటిముందు నిల్చుని వున్నారు. ముఖం మాత్రం ఎవరిదో అర్ధం కావడం లేదు. ఆ ముఖం పూజ్యశ్రీ మాస్టరుగారిదని తెలియడానికి రెండు నెలలు పట్టింది. నేను పూజ్యశ్రీ మాస్టరుగారి ఫొటోలు కొన్ని చూడగా, చూడగా ఒకరోజు నాకు స్వప్నంలో కనిపించిన ముఖం వారిదేనని తెలిసింది! నాకు నిశ్చయంగా తెలియడం కోసం అదే కల మూడు రోజులు వచ్చిందనిపించింది. ఆయన నాతో నీకు స్థానభ్రంశం కావాలని చెప్పారు. అప్పట్లో మేమొక ఇంట్లో వుండేవారము. అక్కడ మాకు చాలా సమస్యలు వచ్చాయి. అప్పుడు మేము ఇల్లు మారి పోయాము. నిదానంగా ఒకొక్క సమస్య తీరిపోయింది.

తరవాత మా పెద్దబాబుని నాలుగవ నెల కడుపుతో వున్నప్పుడు వైద్యులు నన్ను పరీక్షించి ఒక నెలలో గర్భసంచికి కుట్లు వేయాలని చెప్పారు. మళ్లీ 5 వ నెలలో వైద్యుల దగ్గరికి వెళ్లే లోపు ఒకరోజు కలలో ఎవరో మగవారు కొందరు నాకు ఆపరేషన్ చేశారు. మెలుకువ వచ్చాక ఒక రోజంతా ఆ నొప్పి తెలిసింది. తిరిగి ఆసుపత్రికి వెళ్తే, "నీకు కుట్లు వేయాల్సిన అవసరం లేదు!" అని చెప్తూ వైద్యులు చాలా ఆశ్చర్యపోయారు. "డెలివరీ వరకు నీకు ఏ సమస్య రాదు" అని చెప్పారు! ఇదంతా పూజ్యశ్రీ మాస్టరుగారి దయ కాక మరేమిటి? పైగా పూజ్యశ్రీ

మాస్టరుగారి ఆడియో ఏది విన్నా గర్భంలోపల బిడ్డ బాగా కదులుతున్నట్లు తెలిసేది. అలా మాకు చాలా నిదర్శనాలు కనిపించాయి. తొమ్మిది నెలల తరువాత బాబు పుట్టాడు.నాకు గర్భసంచీ సమస్య వున్నది. అందువల్ల డెలివరీ అయ్యేవరకు చాలా జాగ్రత్తగా వుండవలసిన పరిస్థితి. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారి దయవల్ల ఎటువంటి సమస్యలు లేకుండా బాబు పుట్టాడు.

దత్తజయంతి రోజున పూజ్యశ్రీ అమ్మగారు 'మనంత్ యోగనాథ్ భరద్వాజ' అని మా బాబుకి నామకరణం చేసారు.

అలాగే మా రెండవ బాబుని కడుపుతో వున్నప్పుడు నాకు ఎక్కువగా పూజ్యశ్రీ మాస్టరుగారికి పాదపూజ చేసుకోవాలనిపించేది. ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్నదర్శనమిచ్చి,"కుర్చీలో కూర్చుని పాదపూజ చేసుకోమ్మా!" అని చెప్పారు. తరువాత మా చిన్నబాబుకి పుణ్యావచనం రోజున పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సులతో పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలకు అభిషేకం చేసుకున్నాము. మేము వెండిపాదుకలు చేయించుకుని పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సులతో తృప్తిగా అభిషేకం చేసుకున్నాము. అప్పటినుంచి ప్రతి సంవత్సరమూ పిల్లలిద్దరి పుట్టినరోజుకి పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలకు అభిషేకం చేసుకోవడం మా ఇంట్లో ఒక సాంప్రదాయమైంది.

మా చిన్నవాడి పేరు 'భావేశ్ భరద్వాజ'.

ఈ విధంగా మా కుటుంబానికి అండగా నిలిచి, ఇప్పటికీ మాకు మార్గదర్శకత్వం వహిస్తున్న గురుదేవులు పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ పాద పద్మములకు కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు.

ఓం సమర్థ సద్గురు శ్రీ భరద్వాజ గురువే నమః!

హైదరాబాదుకి చెందిన శ్రీమతి అపర్ణ

నా పుట్టిల్లు కావలి. మా అమ్మ, నాన్న ఇద్దరూ వైద్యులు. మా ఇంట్లో పూజ్యశ్రీ మాస్టరుగారు విగ్రహం రూపములో కొలువై వున్నారు. ఇప్పటికీ నిత్యసత్యులై ఎందరికో ఎన్నో అనుభవాలను ప్రసాదిస్తున్నారు. అందులో కొన్నింటిని ఇప్పుడు చెప్పుకుందాము.

ఒకసారి మా ఇంటికీ ఒక వంటావిడ కొత్తగా వచ్చారు. ఆ రోజు మా అమ్మ ఆవిడకి పూజ్యశ్రీ మాస్టరుగారి గొప్పతనం గురించి, ఆయనను సేవించుకునే విధానం గురించి చెప్పారు. సాధారణంగా ప్రతిరోజూ శేజ్ ఆరతి అయ్యాక పూజ్యశ్రీ మాస్టరుగారి గదిలో ఎవ్వరమూ పడుకునేవారము కాము. కానీ ఆరోజు కొన్ని అనివార్య కారణాలవల్ల ఆవిడ ఆ రూమ్ లో పడుకోవలసివచ్చింది. అర్ధరాత్రి ఆవిడకి విపరీతమైన కడుపులో నొప్పి వచ్చిందిట. ఎంతసేపటికీ తగ్గలేదు. 'మొదటిరోజే ఇలా జరిగిందేమిటా?!' అని ఆమె చాలా బాధపడుతూ లేచి పూజ్యశ్రీ మాస్టరుగారి పటం ముందు కూర్చుని, "మీరు చాలా గొప్పవారని చెప్పారు. అదే నిజమైతే నా కడుపులో నొప్పి తగ్గిపోవాలి" అని ప్రార్ధించారు. చిత్రంగా కొద్దిసేపటిలోనే నొప్పి తగ్గిపోయి ఆమె హాయిగా నిద్రపోయారు! మర్నాడు ఉదయం ఈ విషయం అమ్మకి ఆవిడ ఎంతో ఆనందంగా చెప్పారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రసాదించిన ఆ అనుభవాన్ని విని అందరమూ ఎంతో పులకించాము.

అలాగే కావలిలో అమ్మ దగ్గర వైద్యం చేయించుకుంటున్న ఒకావిడ 'మహాత్ముల ముద్దుబిడ్డడు' గ్రంథం పారాయణ చేస్తూ పూజ్యశ్రీ మాస్టరుగారిని దేహంతో వున్నపుడు చూడలేకపోయానని బాధపడుతూ మగతగా పడుకున్నారట.అప్పుడే స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు దర్శనమిచ్చి,"చూడలేదని ఎందుకు బాధ పడతావు? నేను ఇక్కడే డాక్టరుగారి ఇంట్లో వున్నాను. చూపిస్తాను రా!" అని మెట్లదాకా తీసుకువెళ్ళారు. ఈలోపు మెలుకువ వచ్చింది. మర్నాడు ఆవిడ ఆసుపత్రికి వచ్చి ఈ విషయం చెప్పి, ఒకసారి దర్శనం చేసుకుంటానని అడిగి, మా ఇంట్లో కొలువైవున్న పూజ్యశ్రీ మాస్టరుగారికి ప్రణామాలర్పించారు. తరవాత ఆమె ఒంగోలు వెళ్లి పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం చేసుకున్నారట కూడా !!

నేను విశాఖపట్నంలో చదువుకుంటున్నప్పుడు మా పక్కవాళ్ళు పిల్లిని పెంచుకునేవారు. వాళ్ళు ఊరికి వెడుతూ దాన్ని మాకు అప్పచెప్పారు. మాకు దసరా సెలవలు ఇవ్వడంతో నేను దానిని తీసుకుని కావలి వచ్చాను. ఒకరోజు ఒక పెద్ద పిల్లి వచ్చి దీనితో పోట్లాటకి దిగింది. ఈ పిల్లి చాలా అర్భకురాలు. ఆ పెద్ద పిల్లిని ఎదుర్కోలేక పూజ్యశ్రీ మాస్టరుగారి పీఠం కిందకి వెళ్లి దాక్కుంది. అంతే! చిత్రంగా ఆ పెద్దపిల్లి భయపడి ఏమీ చేయలేక వెళ్ళిపోయింది!

మా ఇంట్లో పనిచేసే లక్ష్మి అనే అమ్మాయికి గొర్రెలు వుండేవి. ప్రతిరోజూ సాయంత్రానికి ఒక గొర్రె చనిపోయేది! ఈ సంగతి లక్ష్మి ఒకరోజు మా అమ్మకి చెప్పి బాధపడింది. అప్పుడు అమ్మ, "నువ్వు ప్రతిరోజూ పూజ్యశ్రీ మాస్టరుగారి గదిని శుభ్రం చేస్తావు కదా! ఈ రోజు ఆయనకి ఈ విషయం చెప్పుకో!" అని చెప్పింది. ఆ అమ్మాయి అలాగే చేసింది. ఆ రోజునుంచీ ఒక్క గొర్రెకూడా చనిపోలేదు!

ఇలా మనకే కాక సకల జీవకోటికి ఆ సమర్థ సద్గురువు అభయం ఇచ్చి రక్షిస్తున్నారు. ఇంకా ఎందరెందరికో ఎన్నెన్నో అనుభవాలు! మా ఆసుపత్రిలో పనిచేసేవారందరికి చాలా అనుభవాలు ప్రసాదించారు. మేమి ఎప్పుడైనా ఊరికి వెళ్తే స్వామి హోటల్ నుంచి ఒక అబ్బాయి వచ్చి ప్రతిరోజూ పూజ్యశ్రీ మాస్టరుగారికి ఉదయం కాఫీ, టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం కాఫీ, రాత్రి టిఫిన్, ప్రసాదాలు సమర్పించి సేవచేసుకునే వాడు. అలా అతనికి ప్రేరణనిచ్చి మా ఇంట్లో సేవ నిరంతరంగా జరిగేటట్లు అనుగ్రహించారు పూజ్యశ్రీ మాస్టరుగారు. ఇలా అందరికీ అభయప్రదాతగా నిత్యసతులై అక్కడ కొలువై వున్నారు పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ !!

ఓం నిత్యసత్యాయ శ్రీ భరద్వాజాయ నమః!

శ్రీ దుర్గాప్రసాద్ గారు

పూజ్యశ్రీ మాస్టరుగారు పరిచయమైన తరువాత నా జీవితవిధానం మారిపోయింది. నన్ను ప్రతిరోజూ పూజ చేయమని చెప్పినందుకు పూజచేయడం నా నిత్యకృత్యమైపోయింది. నా ఆలోచనలన్నీ పూజ్యశ్రీ మాస్టరుగారి పైనే వుండేవి. 'భగవంతుడు నాకు దొరికాడు. ఆయన ఒంగోలులో వున్నారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు దర్శించవచ్చు!' అని వుండేది.

పూజ్యశ్రీ మాస్టరుగారికి నాలో వచ్చిన మార్పులు తెలుపుతూ ఉత్తరం వ్రాశాను. కానీ నేను ఎంత ఎదురుచూసినా ఆయననుంచి సమాధానం రాలేదు. మళ్ళీ నిష్ఠూరమాడుతూ ఇంకొక ఉత్తరం వ్రాశాను. అందులో, 'మీరే నాకు పెన్నిధి, మీరే నా గురువు!' అని వ్రాశాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధానం వ్రాస్తూ, 'శ్రీ సాయినాథుని చల్లని నీడ నీకు నా ద్వారా

లభించినందుకు నాకెంతో సంతోషంగా వుంది!' అని వ్రాశారు. ఆయన గురువుగా నాకు లభ్యమైనారు, కాబట్టి నేనేమి చేయాలో వ్రాశారు. ఆయన దర్శనంతోనే నా జీవితం మారిపోయింది. ఈసారి ఇంటర్ పాసయ్యాను. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్స్ ఒకేసారి వ్రాసి ఉత్తీర్ణుడినైనాను.

పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర నేనొక్కడినే వున్నప్పుడు ఒకసారి ఆయన, "నువ్వు హైదరాబాదులో వుంటావు కాబట్టి శ్రీ నాంపల్లి రైల్వేస్టేషన్ లో వుండే శ్రీ నాంపల్లి బాబాగారిని విరామ సమయంలో దర్శనం చేసుకుంటూ వుండు, ఆయన గొప్ప అవధూత!" అని చెప్పారు. ఆయన ఆదేశంతో నేను వీలైనప్పుడల్లా శ్రీ నాంపల్లి బాబాగారిని దర్శనం చేసుకుంటుండేవాడిని. నేను చాలా సున్నితమైన మనస్సుకలవాడిని కాబట్టి శ్రీ నాంపల్లి బాబాగారు నన్ను తిట్టడం, కొట్టడం చేయకుండా చూడమని పూజ్యశ్రీ మాస్టరుగారిని కోరాను. అదేవిధంగా వారు నన్ను ఏనాడూ ఏమీ అనలేదు. పైగా టీ తీసుకెళ్లినా, బిరియానీ తీసుకెళ్లినా కొంత ప్రసాదంగా నాకు ఇచ్చేవారు. ఆ మహాత్ముని సమాధి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం నాకు లభించింది.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఎప్పుడూ సత్సంగాల గురించి చెబుతుంటే, 'అసలు సత్సంగాలు ఎలా చేయాలి?' అని నేను ఉత్తరం వ్రాశాను. వెంటనే 'సత్సంగము-భజన' పుస్తకాలు పంపించారు. కేవలం పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రోద్బలంతో నేను, మా మిత్రులు 75 వారాలు పంజాగుట్ట శ్రీ సాయిబాబా గుడిలో సత్సంగము నిర్వహించడం జరిగింది. తరువాత ఉన్నత చదువుల కోసం నేను ఆ ప్రదేశం వదిలి వెళ్లిపోవలసి వచ్చింది.

ఒకరోజు నా మిత్రుడొకడు నా దగ్గరకు వచ్చి తాను చాలా సమస్యలలో వున్నానని, తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందా మనుకుంటున్నానని నాతో చెప్పి బాధపడ్డాడు. అతడికి తండ్రి లేడు, అన్నగారి పోషణలో వున్నాడు. ఇంజనీరింగ్ లో మూడు సబ్జక్ట్స్ లో తప్పాడు. ఎంత ప్రయత్నించినా ఇంజనీరింగ్ పూర్తవ్వలేదు. అతని అన్న తీవ్రంగా మందలించడంతో తీవ్ర వేదనకి గురై నాతో చెప్పుకున్నాడు. నేను అతనికి చాలా నచ్చచెప్పి, నా గురుదేవులైన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి గురించి చెప్పి, నా జీవితం వారి దయవలన ఎలా మారిందో వివరించాను. "నా గురుదేవులు సర్వసమర్థులు, సాక్షాత్తు శ్రీ సాయినాథుని ప్రేమస్వరూపం, ఆయనను ఒంగోలులో ప్రత్యక్షంగా

దర్శించుకోవచ్చు. ఆయన దయతో నువ్వు ఈసారి పరీక్షలు వ్రాయి, తప్పకుండా పాస్ అవుతావు" అని నేను అతనికి పూర్తి విశ్వాసంతో చెప్పాను. నేను అతని తరపున పూజ్యశ్రీ మాస్టరుగారిని ప్రార్థించడం మొదలుపెట్టాను. నా నమ్మకాన్ని గురుదేవులు వమ్ము చేయలేదు. ఎన్నిసార్లు పరీక్ష వ్రాసినా పాసవ్వని అతను ఈసారి పాసవ్వడం జరిగింది. పాఠ్య పుస్తకాలతో పాటు శ్రీ సాయిలీలామృతము గ్రంథం కూడా శ్రద్ధగా చదవమని చెప్పాను. అతని జీవితంలో జరిగిన ఈ సంఘటనకు విపరీతంగా ఆనందించి అతను కూడా మాతోపాటు సత్సంగాలలో పాల్గొనేవాడు. అందరం కలసి పూజ్యశ్రీ మాస్టరుగారి లీలలు చెప్పుకుంటూ వుండేవాళ్ళము.

ఒక రోజు ఒక సత్సంగసభ్యుడు మా గదిని వెతుక్కుంటూ ఎంతో ఆదుర్దాగా ప్రయాసపడి వచ్చాడు. తాను వచ్చి, "మీ గురువుగారు రెండురోజుల క్రితం ఒంగోలులో సమాధి చెందారు!" అని చెబితే నమ్మలేకపోయాను. అతను, "ఈ విషయం న్యూస్ పేపర్ లో, రేడియోలో కూడా వచ్చింది!" అని చెబితే పిడుగుపడినట్లయింది. కళ్ళవెంట నీళ్లు కారిపోయాయి. అంతటి ప్రేమమూర్తి అంత హఠాత్తుగా వెళ్ళిపోతారని ఊహించలేదు. అంతటి గొప్ప గురువు అంత తొందరగా భౌతికంగా అదృశ్యమైపోతే ఇక నా పరిస్థితి ఏమిటని పిచ్చిపట్టినట్లైంది. కోలుకోవడానికి చాలా రోజులు పట్టింది. 'భగవంతుని చూడాలన్నా, మాట్లాడాలన్నా నాకు అలా ఒక రాత్రి ప్రయాణం చేసి ఒంగోలు వెళ్తే చాలు!' అన్నట్లుండేది. 'ఇంక నాకు దిక్కెవ్వరు? మన బాధలు, కష్టాలు ఎవరు తీరుస్తారు? ఎలా?' అని చాలా దిగులుపడేవాడిని. ఆయన దయతో శ్రీ రామిరెడ్డితాత, పరాడ్సింగాలోని శ్రీ అనసూయమాత, శ్రీ శివనేశన్ స్వామి మొదలగు మహాత్ముల దర్శనమైంది. పూజ్యశ్రీ మాస్టరుగారిని స్మరిస్తే ఆయా మహాత్ములు ఎంతో కరుణ నాపై చూపడం నా అనుభవం.

12,13 సంవత్సరాలపాటు ఎంతోమంది పీఠాధిపతులను, భగవంతుని అవతారాలమని చెప్పుకునే స్వాములను దర్శనం చేసుకున్నాను. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారు చూపిన ప్రేమ, అనుగ్రహం నాకెక్కడా దొరకలేదు.

పేరున్న స్వామీజీలు, బాబాలు పగటిపూట ఉపదేశాలు చేస్తూ రాత్రి పూట డబ్బు సమకూర్చుకోవాలని ప్రయత్నిస్తుంటే నాకు విరక్తి కలిగేది. 'వీరు కూడా మనలాగే వున్నారే!' అనిపించేది. పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవులు

ఏనాడూ ధనానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎంతోమంది ఆస్తులు ఇచ్చేస్తామన్నా వాటినన్నింటినీ తృణప్రాయంగా తోసేసేవారు. ఇది నేను నా కళ్ళతో చూశాను. దూషణభూషణలను పట్టించుకునేవారు కాదు. తన ఉచ్ఛ్వాసనిశ్వాసలలో సంపూర్ణంగా సాయినాథుని నింపుకున్న పూజ్యశ్రీ భరద్వాజులు నడయాడే సాయినాథునివలే వుండేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారిని దర్శిస్తే శ్రీ సాయినాథుని దర్శించలేదనే బాధ మనకుండదు. ఆయన పాదతీర్థం సేవించాక సాయినాథుని పాదతీర్థం దొరకలేదనే బాధ మనకుండదు.

ఇంతకు ముందు నేను చెప్పిన స్నేహితుడిని (ఇంజనీరింగ్ ఎన్నిసార్లు చదివినా తప్పి పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహంతో పాసైన వ్యక్తిని) అనుకోకుండా 20 సంవత్సరాల తరువాత కలిశాను. అతని పేరు రంగారావు. అతను ఇప్పుడు SEW అనే వేలకోట్ల టర్నోవర్ వున్న కంపెనీలో GM గా పనిచేస్తున్నాడు. మేము చాలాసేపు బాబా గురించి, పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి మాట్లాడుకున్నాము. ఇలా ఎన్ని లక్షలమందికి పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు జీవితాన్నిస్తున్నారో మనకేమి తెలుసు?

నన్ను పూజ్యశ్రీ మాస్టరుగారు బస్సు ప్రమాదం నుండి రక్షించారు. నేను ఒకసారి గుంటూరునుండి అనంతపూర్ కి బస్సులో ప్రయాణం చేయవలసివచ్చింది. రిజర్వేషన్ కోసం ప్రయత్నిస్తే చివరివరుసలో కిటికీ దగ్గర సీటు దొరికింది. తప్పకుండా ప్రయాణం చేయాలి కాబట్టి ఇబ్బందిగా వున్నా బయలుదేరాను. బస్సు ఒకచోట భోజనానికి ఆపితే నేను కూడా భోజనానికి వెళ్ళి మళ్ళీ వచ్చి నా సీట్లో కూర్చున్నాను. నా పక్క సీట్లో కూర్చున్న ప్రయాణీకులు మారిపోయారు! వాళ్ళు నన్ను ఏదోగా చూస్తున్నారు. నేనది పెద్దగా పట్టించుకోలేదు. నిద్ర వస్తోందని పడుకొనే ప్రయత్నం చేస్తున్నాను. కొంతసేపటికి ఒక నిర్మానుష్య ప్రాంతంలో బస్సు ఆగింది. ఏమైందని చూస్తున్నాను. బస్సులో లైట్లు వెలిగివున్నాయి! అకస్మాత్తుగా నాకు ముందర రెండవ వరుసలో కూర్చున్న ఒక వ్యక్తి తన పక్కన సీట్ వుందని రమ్మని పిలుస్తున్నాడు. హృదయంలో వెంటనే అక్కడికి వెళ్లిపోవాలనిపించి వెంటనే లేచి ముందువరుసలో కూర్చున్నాను. బస్సు బయలుదేరింది.

నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. మొత్తం రిజర్వేషన్ అయిన బస్సులో ముందువరుసలో నాకీ సీట్ ఎలా దొరికింది? ఇంకా బస్సులో చాలామంది

నిలబడి కూడా వున్నారు! ఇలా చాలా ప్రశ్నలు నన్ను ఆశ్చర్యపరిచాయి. మరునాడే అనంతపూర్ చేరుకున్నాక తెలిసిందేమంటే, నాతో పాటు చివరివరుసలో కూర్చున్నవాళ్లంతా దొంగలని, ప్రయాణీకులకు మత్తిచ్చి నిలువునా దోచుకుంటారని, వాళ్ళు నా బదులు మరో ప్రయాణికుణ్ణి దోచుకున్నారనీ తేలింది. అవసరమైతే చంపడానికి కూడా వాళ్ళు వెనుకాడరట!

అంటే ఆ రిజర్వేషన్ సీట్ లో పూజ్యశ్రీ మాస్టరుగారే వేరురూపంలో ప్రయాణించి అక్కడ నాకు సీట్ ఇచ్చారన్నమాట! ఈ లీలను తలుచుకుంటే నా కనుల వెంట ఆనందభాష్పాలు కురుస్తాయి.

సద్గురువు ఏ రూపంలోనైనా మనల్ని కాపాడగలరు!

ఓం భక్తరక్షకాయ భరద్వాజాయ నమః!

హైదరాబాదు – నాగోలులో వుంటున్న శ్రీమతి విశాలాక్షి గారు

2007 వ సంవత్సరంలో నాకొక స్వప్నం వచ్చింది. అప్పటికి నాకు పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి కానీ, పూజ్యశ్రీ అమ్మగారి గురించి కానీ ఏమీ తెలియదు. వాళ్ళ చిత్రపటాలు కూడా నేనెప్పుడూ చూడలేదు. నేను ఒక వీధిలో నడుస్తున్నాను. దారిలో ఒక ఇంటి ముందు ఒకావిడ ముగ్గు వేస్తున్నారు. పక్కనే ఒకాయన లుంగీ, తెల్లబనీను వేసుకుని నిలుచుని వున్నారు. నేను యధాలాపంగా అటు చూశాను. వెంటనే ఆయన, "రామ్మా!" అని పిలిచారు. ముగ్గు వేస్తున్న ఆవిడ వెంటనే తలెత్తి చూశారు. "మన అమ్మాయి వచ్చింది!" అని ఆవిడతో చెప్పి నన్ను లోపలకు పిలిచారు. నేను వారిని అనుసరించాను. "అమ్మాయికి కాఫీ ఇవ్వు!" అన్నారు ఆయన. ఆవిడ కాఫీ చేసి ఇచ్చారు. ఈ లోపల మెలకువ వచ్చింది. నేను ఆ కల గురించి అంతగా పట్టించుకోలేదు -- ఎందుకంటే ఆ కలలోని దంపతులు ఎవరో నాకు తెలియదు కనుక!

సరిగ్గా రెండు సంవత్సరాల తరువాత నాకు పూజ్యశ్రీ అమ్మగారి దర్శనమవ్వడం, పారాయణ మొదలుపెట్టడం జరిగింది. అయినా ఆ కల నాకు గుర్తు రాలేదు. 2009 లో మళ్ళీ అదే స్వప్నం వచ్చింది. అప్పుడు ఇదివరకే ఈ కల వచ్చింది అని గుర్తుకు వచ్చింది! అంటే నేను వారి పాదాల వద్దకు వచ్చేలోపే

ఆ సద్గురుదంపతులు అపార కరుణతో తమ దర్శనమనుగ్రహించి నన్ను తమ కుటుంబంలో చేర్చుకున్నారన్నమాట!

తరువాత 2010 లో మేము నాగోలుకి వచ్చేశాము. 2011 లో ఒకరోజు గుండెల్లో నొప్పిగా అనిపించి సాయంత్రం వైద్యుని దగ్గరకి వెళ్లాను. ECG తీసి కొద్దిగా తేడాగా వుంది, ఆసుపత్రిలో చూపించుకోమన్నారు. మరుసటిరోజు వెళదామన్న ఉద్దేశంతో ఇంటికి వచ్చేశాను. కానీ ఆరోజు రాత్రి బాగా నొప్పి వచ్చింది. చాలాసేపు సోఫాలో కూర్చునే వున్నాను. తెలతెలవారుతూ వుండగా కొద్దిగా కునుకు పట్టింది. అప్పుడు ఒక కల వచ్చింది. నా ఎదురుగా పూజ్యశ్రీ మాస్టరుగారి పెద్ద పటం వుంది. అందులోనుంచి పూజ్యశ్రీ మాస్టరుగారు తన చేయిని బయటకు చాపి ఒక పెసరట్టుముక్క నాకు ఇచ్చి, "ఇది తీసుకో తగ్గిపోతుంది!" అన్నారు. నిజంగానే పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహం వల్ల మరునాటినుంచి నాకు గుండెల్లో నొప్పి రాలేదు! దానికి కృతజ్ఞతగా నిలయంలో పూజ్యశ్రీ మాస్టరుగారికి నేను పెసరట్లు సమర్పించుకున్నాను.

ఇదేవిధంగా వారి అనుగ్రహం ఈ జన్మలోనే కాక జన్మ జన్మలకూ ప్రసాదించమని అశ్రునయనాలతో అర్థిస్తూ ప్రణామాలర్పిస్తున్నాను !!

ఓం ఆరోగ్యప్రదాత్రే నమః!

హైదరాబాదుకి చెందిన నరసింహగారు

మేము ఇంతకుముందు రాఘవేంద్రస్వామిని ఆరాధించేవారము. తరువాత ఆ స్వామియే పూజ్యశ్రీ మాస్టరుగారిని చూపించారని మా నమ్మకం. ఎందుకంటే మా బృందంలో ఒకరైన నరహరిగారు, టి.వి.రావుగారి ఇంట్లో అద్దెకు దిగినప్పుడు మేమంతా వాళ్ళ ఇంటికి వెళ్ళాము. వారిద్వారా పూజ్యశ్రీ మాస్టరుగారిగురించి, పూజ్యశ్రీ అమ్మగారి గురించి తెలిసింది. కాలక్రమేణా మేము కూడా శ్రీసాయిలీలామృతం పారాయణ చేయడం మొదలుపెట్టాము. నాగోలులో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్ళేవాళ్ళం.

నేను శ్రీ సాయిలీలామృతం పారాయణ చేస్తుంటే స్వప్నంలో విద్యానగర్ లోను, ఒంగోలులోనూ వున్న పూజ్యశ్రీ మాస్టరుగారి బృందావనం దర్శనమిచ్చాయి. తరవాత నేను ఆ క్షేత్రాలు దర్శించినప్పుడు నాకు స్వప్నంలో

కనిపించినట్టే వుండేసరికి నేను చాలా ఆశ్చర్యపోయాను. పూజ్యశ్రీ మాస్టరుగారితో నాకు జన్మజన్మలనుంచి సంబంధం వుందేమోననిపించింది.

నాకు జరిగిన ఒక అద్భుతమైన అనుభవం మీతో పంచుకుంటాను. 2010 వ సంవత్సరంలో మా పాపని బోడుప్పల్ దగ్గర వున్న స్కూల్ లో జాయిన్ చేయడం కోసం అక్కడ ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నాము. రెండు వాటాల ఇల్లు అది. పక్కవాటాలో కూడా నాకు తెలిసిన అతనే దిగాడు. ఇద్దరం ఒకేసారి అద్దెకు దిగాము. కాలనీలో చివరకు ఆ ఇల్లు వుండేది. ఇల్లు మాత్రం చూడడానికి చాలా బాగుండేది. కానీ ఆ ఇంట్లోకి వెళ్లిన కొన్నిరోజులకు ఇంకా ఎవరో ఆ ఇంట్లో వున్నారేమో అన్నట్లు ఏవేవో చప్పుళ్ళు వినిపించేవి. మాకన్నా మా ఇంటికి ఎవరైనా వస్తే వాళ్ళని ఎవరో తోసేసినట్లు వుండేదట. ఆ అనుభవమైన వారిలో మా నాన్నగారు ఒకరు. మేమందరము ఒకసారి బయటకు వేళ్తే మా నాన్నగారు ఒక్కరే ఇంట్లో వున్నారు. అప్పుడు ఆయనను ఎవరో బలంగా తోసేశారట! ఆయనకు ఏదో అనుమానం వచ్చి నాతో చెప్పారు. నేను పెద్దగా పట్టించుకోలేదు.

కొన్నిరోజుల తరువాత ఒకరోజు నాకొక కల వచ్చింది. అది కలా, నిజమా ఇప్పటికీ అనుమానమే !

ఒక నల్లటి వ్యకి నామీదకు వచ్చి నా పిల్లలను ఎత్తుకుపోతానని బెదిరించాడు. నేను పిల్లలిద్దరినీ ఎత్తుకుని వాడికి దొరకకుండా ఇల్లంతా పరుగెడుతున్నాను. అలా పరుగెడుతూనే , “నువ్వు నన్ను ఏమీ చేయలేవు! నాకు మా గురుదేవులున్నారు!” అని చెప్తూ, “ఓం సాయినాథ్ జై ! గురు భరద్వాజ జై!” అని నామం చేస్తున్నాను. కానీ ఆ నల్లటి మనిషి నన్ను పెద్ద పెద్ద తాళ్లతో కట్టేసి చాలా బాధలు పెడుతున్నాడు. కానీ నేను నామం ఏమాత్రం వదలలేదు. ఈ లోపల, “పోస్ట్” అన్న కేక వినిపించింది. నేను తలుపు తీసి చూస్తే సాయిబాబా మాసపత్రిక పోస్టులో వచ్చింది! దాని మీద పూజ్యశ్రీ మాస్టరుగారి, పూజ్యశ్రీ అమ్మగారి ఫోటో వుంది. నేను వెంటనే ఆ పత్రిక వాడి దగ్గరికి తీసుకెళ్లి ,”ఇదుగోరా! నా గురుదేవులు వచ్చారు. ఇంక నువ్వు నన్నేమి చేయలేవు!” అన్నాను. అయినా ఆ దెయ్యం తిరగపడుతుంటే వెంటనే ఒక ముసలిది ప్రత్యక్షమై, “ఒరేయ్ ఎవరితోనన్నా పెట్టుకోగాని ఈ గురువుని పూజించేవాడితో పెట్టుకోవద్దు!” అని పక్కకి తీసుకెళ్లిపోయింది.

నాకు వెంటనే మెలుకువ వచ్చింది. ఒళ్ళంతా చెమటలు పట్టి వున్నాయి. కానీ 'ఏదో పీడ కల అయ్యివుంటుందిలే!' అని అంతగా పట్టించుకోలేదు. ఆ మరునాడు పక్కవాటాలో వున్నతను వాళ్ళ కుటుంబం ఊరికి వెళ్తే ఒక్కడే వున్నాడట. ఆ రాత్రి అతనిని దయ్యాలు చాలా బాధపెట్టాయట! మా ఇంట్లోకి అతని అరుపులు వినిపించాయి. 'ఇంట్లో ఎవరూ లేరు కదా, ఎవరితో పోట్లాడుతున్నాడు?' అనుకున్నాను. మరునాడు ఉదయం అతను నాతో, "ఈ ఇంట్లో ఏవో ప్రేతాత్మలు వున్నట్లున్నాయి. రాత్రి నన్ను బాగా కొట్టాయి!" అని చెప్పాడు. అప్పుడు నాకు జరిగినది కూడా గుర్తుకువచ్చి అది నిజమేననిపించి చుట్టుపక్కలవాళ్ళని అడిగితే, ' ఈ ఇల్లు కడుతున్నప్పుడే ఇద్దరు ఉరి వేసుకుని చనిపోయార'ని చెప్పారు. ఆ ఇంటికి ఎవరు వచ్చినా ఒక నెలకంటే ఎక్కువ వుండరని, 'మీరు ఇన్ని నెలలు (దాదాపు 8 నెలలు వున్నాము) ఎలా వున్నారా?' అని ఆశ్చర్యపోతున్నామనీ చెప్పారు. వెంటనే మేము ఇంకొక ఇంటికి మారిపోయాము.

ఇన్ని నెలలు ఆ ఇంట్లో వున్నా మా ఇంట్లో పటం రూపంలో శ్రీ అలివేలుమంగా సహిత భరద్వాజ మహారాజ్ కొలువైవుండి మమ్మల్ని కంటికి రెప్పలా కాపాడినందుకు వేల వేల కృతజ్ఞతలు, పాదాభివందనాలు!!

ఓం పిశాచబాధానివారణాయ నమః!

హైదరాబాదుకు చెందిన శ్రీమతి అరుణగారు

ఈ లీల 20 సం|| క్రితం జరిగింది. ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధికి వస్త్రం కుట్టి సమర్పించుకున్నాను. కొన్ని రోజుల తర్వాత ఒక స్వప్నం వచ్చింది. అందులో నేను శిరిడీ వెళ్లాను. అక్కడ బాబా దర్శనానికి వెళ్తే, అసలు సమాధి క్రింద వుందని చెప్పి దారి చూపించారు అక్కడి పూజారులు!! నేను క్రిందకి వెళ్లి దర్శనం చేసుకుని పైకి వచ్చాను. తీరా వచ్చాక గుర్తుకు వచ్చింది, అక్కడ ఏదో మర్చిపోయానని. మళ్లీ ఆ పూజారిని అడిగాను, "వెళ్ళనా?" అని, "సరే వెళ్ళి రండి!" అన్నారు. క్రిందికి వెళ్ళాక, మళ్లీ సమాధికి నమస్కారం చేసుకుంటుంటే అప్పుడు చూశాను! నేను ఒంగోలుకి పంపించిన వస్త్రం ఇక్కడ శిరిడీలో సమాధి మీద వుంది! నేను చాలా ఆశ్చర్యపోయాను, నేను పంపినది

పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరానికి, కానీ అది బాబా సమాధి మీద వుంది!! 'అంటే పూజ్యశ్రీ మాస్టరుగారికి, శ్రీ బాబాకు భేదం లేదన్నమాట!' అనుకుంటూ పైకి వచ్చాను. మెలకువ వచ్చాక అనిపించింది, వారిరువురూ ఒక్కటేనని నిరూపించడానికే నాకు వారు ఈ అనుభవం ప్రసాదించారని!

1998 సం||లో బాబుగారి (గురుపుత్రులైన శ్రీ ద్వారాకానాథ్ గారి) ఉపనయనానికి నాకు ఆహ్వానపత్రిక వచ్చింది. కానీ నేను వెళ్ళలేకపోయాను. చాలా బాధపడ్డాను. అప్పుడు ఒక స్వప్నం వచ్చింది. అందులో నేను బాబుగారి ఉపనయనానికి వెళ్లాను. అంతా సందడిగా వుంది. ఇంకా కార్యక్రమం మొదలవలేదు. అక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారు వున్నారు. నేను ఆయనకు నమస్కారం చేసుకున్నాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారన్నారు నాతో, "ఉపనయనం వేరొక చోట జరుగుతుంది. అందరూ వెళుతున్నారు. వాళ్లందరితో నువ్వు కూడా వెళ్ళు!" అన్నారు. "మరి మీరు రారా మాస్టరుగారూ!" అన్నాను. "ఎందుకు రాను? మీరందరూ వెళ్ళండి. నేను తర్వాత వస్తాను" అన్నారు. ఈ స్వప్నం ద్వారా, పూజ్యశ్రీ మాస్టరుగారి సమక్షంలోనే ఉపనయనం జరిగిందన్న అనుభవాన్ని నాకు ప్రసాదించడమే కాకుండా, వెళ్ళలేకపోయాను అని బాధ పడుతున్న నాకు, అక్కడికి తీసుకెళ్లడమే కాక ఆయన దర్శన భాగ్యాన్ని కూడా ప్రసాదించారు. నా మనసులోని బాధను పోగొట్టడానికి ఇంతటి అనుగ్రహాన్ని ప్రసాదించిన పూజ్యశ్రీ మాస్టరుగారికి కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు!!

మావారు నిలయానికి గానీ, అక్కడ జరిగే కార్యక్రమాలకి గాని రారు. కొన్ని రోజులు నన్ను కూడా వద్దనే వారు. అయినా నేను మాత్రం వెళ్ళేదాన్ని. కానీ నాకు మనసులో చాలా బాధగా వుండేది. 'ఆయన కూడా వస్తే బాగుండును కదా!' అనిపించేది. ఒకసారి మేము శిరిడీకి వెళ్ళాం. బస్సులో ప్రయాణం చేస్తున్నాం. అప్పుడు నాకొక కల వచ్చింది. శిరిడీలో ఇద్దరమూ ప్రదక్షిణలు చేస్తున్నాం. అక్కడ అకస్మాత్తుగా పూజ్యశ్రీ మాస్టరుగారు కనిపించారు. పూజ్యశ్రీ మాస్టరుగారి చూపు ఎక్కడో వుంది. చాలా రౌద్రంగా వుంది. నాకు చాలా భయమేసింది. నేను ఆ వైపుగా చూశాను. అక్కడ మావారున్నారు! పూజ్యశ్రీ మాస్టరుగారు చూసిన చూపుకి మావారు భస్మమైపోయారు! నేను కంగారుగా, 'మాస్టరుగారు ఇలా చేశారేమిటి?' అనుకుంటున్నాను. ఇంతలో పూజ్యశ్రీ

మాస్టరుగారు, 'ఏం ఫరవాలేదు నేనున్నానుగా!' అన్నట్లు నావైపు చూసి, మళ్లీ అటు వైపు చూసారు. తిరిగి మావారు మామూలుగా అయిపోయారు! ఈ కల ఇంతటితో అయిపోయింది. కానీ తరువాత చాలాసార్లు ఇలాంటి కలలు వచ్చాయి. 'నాకు ఎందుకిలా వస్తున్నాయి?' అని అనిపించేది. ఒకసారి కలలోనే పూజ్యశ్రీ మాస్టరుగారు, 'అతనిలో వున్న చెడ్డ అభిప్రాయాలని తీసేస్తున్నానమ్మా!' అన్న అర్థం వచ్చేట్లు నాకు వివరించారు.

నిజంగానే తరువాత పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి ఆయన కూడా వచ్చారు. అవసరమైతే నాగోలుకి బండి మీద నన్ను తీసుకువస్తున్నారు. నన్ను ఇదివరకటిలా నిర్బంధం పెట్టడం లేదు.... అంతా పూజ్యశ్రీ మాస్టరుగారి దయ!!

ఓం భక్తపాలనాయ నమః!

హైదరాబాదు – కొత్తపేటకు చెందిన శ్రీమతి చింత లక్ష్మిగారు

మావారు చింతా లక్ష్మీనారాయణగారు. మాది రాజమండ్రి. మావారు అక్కడే బ్యాంకులో ఉద్యోగం చేసేవారు. మాకు అక్కడనుంచి గూడూరు దగ్గరున్న వాకాడుకు బదిలీ అయింది. అది బాగా పల్లెటూరు కావడం వల్ల గూడూరులో వుండేవారము. మావారు రోజూ వాకాడుకు వెళ్లి వస్తుండేవారు. విద్యానగర్ లో సూర్యప్రకాశరావుగారని ఒక లెక్చరర్ గారు వుండేవారు. ఆయన మావారికి స్నేహితులు. ఆయన, "ఇక్కడ భరద్వాజగారని లెక్చరర్ గారు వున్నారు. బాబా గురించి చాలా బాగా చెప్తారు. నీకు పరిచయం చేస్తాను" అని చెప్పి మావారిని పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరికి తీసుకువెళ్లారు.

అప్పటికి మావారికి బ్యాంకులో ఏవో సమస్యలు వుండేవి. ఆ సమస్యలు చెబితే పూజ్యశ్రీ మాస్టరుగారు మావారికి 'శ్రీ సాయిలీలామృతం' గ్రంథం ఇచ్చి పారాయణ చేయమన్నారు. అలా చేస్తుంటే కొంతకాలానికి కొన్ని సమస్యలు తీరిపోయాయి, కానీ కొన్ని తీరలేదు. తిరిగి పూజ్యశ్రీ మాస్టరుగారిని దర్శించుకుని ఈ విషయం చెబితే 'శ్రీగురుచరిత్ర' గ్రంథం ఇచ్చి పారాయణ చేయమన్నారు. అప్పుడు సమస్యలన్నీ చక్కబడ్డాయి.

తరువాత పూజ్యశ్రీ మాస్టరుగారితో మాకు బాగా సాన్నిహిత్యం ఏర్పడింది. విద్యానగర్ దాటి పూజ్యశ్రీ మాస్టరుగారు ఎక్కడికి వెళ్ళాలన్నా

గూడూరు మీదనుంచే వెళ్ళాలి. పూజ్యశ్రీ మాస్టరుగారు సత్సంగాలకి వేరే ఊళ్ళకి వెళ్ళేటపుడు తప్పకుండా మా ఇంటికి వచ్చి వెళ్ళవలసిందిగా మావారు ఆయనను ప్రార్ధించి వారి వద్ద మాట తీసుకున్నారు. కనుక పూజ్యశ్రీ మాస్టరుగారు తరచూ మా ఇంటికి వస్తుండేవారు.

కొంతకాలానికి విద్యానగర్ లోని బాబా గుడికి పూజ్యశ్రీ మాస్టరుగారు శంకుస్థాపన చేస్తున్నారు. దానికి శ్రీ పూర్ణానందస్వామి కూడా వచ్చారు. మేము కూడా విద్యానగర్ కి వెళ్ళాము. ముందుగా సూర్యప్రకాశరావుగారి ఇంటికి వెళ్ళాము. అక్కడ నుంచి బాబా గుడికి వెళ్లాలని మా సంకల్పం. కానీ నాకు ఉన్నట్లుండి కడుపులో నొప్పి మొదలైంది. నేను అప్పుడు 6వ నెల గర్భవతిని. అంతకుముందు మాకు ఒక బాబు వున్నాడు. లోపల నాకు ఏదో అసౌకర్యంగా వుందని మా వారితో చెప్పాను. సరేనని ఆయన ఒక్కరే శంకుస్థాపనకు వెళ్లారు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారితో ఈ విషయం చెప్పారట. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు మావారికి విభూది ఇచ్చి నాకు ఇవ్వమని చెప్పారట. మేము అప్పటికప్పుడు బయలుదేరి వెనక్కి గూడూరు వచ్చేశాము. ఇంటికి వచ్చాక నాకు అబార్షన్ అయింది. అయితే ఇక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారు ఇచ్చిన ఊది ఎలా పనిచేసిందంటే, మామూలుగా 6 వ నెలలో అబార్షన్ అయితే కొద్దిగా ఇబ్బందికర పరిస్థితులే వుంటాయి. అలాంటిది ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆసుపత్రికి వెళ్లిన వెంటనే చాలా సునాయాసంగా పని జరిగి ఇంటికి వచ్చేశాను! అప్పుడు మొట్టమొదటిసారి పూజ్యశ్రీ మాస్టరుగారు సామాన్యులు కారని నాకు అనిపించింది. అంతటి కష్టం నుంచి నా కన్నతండ్రిలా ఆయన నన్ను కాపాడారు. వారికి ఎప్పటికీ కృతజ్ఞతలు !!

తరువాత కొంతకాలానికి మాకు అక్కడనించి బదిలీ అవుతుందన్నారు. మళ్ళీ రాజమండ్రి వైపు బదిలీ చేస్తారేమోనని నాకు బాధగా వుండేది. అటువైపు వెళ్లడం నాకు ఇష్టం లేదు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఇచ్చిన బాబా పటం మా ఇంట్లో వుండేది. ఆ పటం పెట్టుకుని రోజూ బాధపడుతూ వుండేదానిని. ఈ సందర్భంలో ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు వేరే ఊరికి వెళ్తూ గూడూరులోని మా ఇంటికి వచ్చారు. వస్తూనే, నేనేమీ వారికి చెప్పకుండానే, “ఎందుకమ్మా బాధపడటం? మనం ఎక్కడికి బదిలీ చేయమంటే బాబా అక్కడికే చేస్తారు!”

అన్నారు! వారు అన్నట్లుగానే నేను కోరుకున్న వైపే ఉలవపాడుకు బదిలీ అయింది. పూజ్యశ్రీ మాస్టరుగారు ఘటనాఘటన సమర్థులనిపించింది.

ఉలవపాడులో ఉన్నప్పుడే మా అబ్బాయి బాబ్జీ డాబా మీదనుంచి పడిపోతే ప్రత్యక్షంగా బాబా వచ్చి రక్షించారు. ఆ లీల శ్రీసాయిలీలామృతం గ్రంథంలో పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రచురించారు. అసలు బాబాకు, పూజ్యశ్రీ మాస్టరుగారికి బేధమేలేదనిపించేది. వారికి కష్టం చెప్పుకుంటే వీరు తీర్చేవారు, వీరికి చెప్పుకుంటే వారు తీర్చేవారు !

1980 లో ఉలవపాడులో పూజ్యశ్రీ మాస్టరుగారి సత్సంగం ఏర్పాటు చేశారు. ముందు మా ఇంటికి తీసుకువచ్చాము. వారికి స్నానం చేయించి మావారు పట్టుపంచె కట్టారు. తరవాత మేమందరమూ పూజ్యశ్రీ మాస్టరుగారికి పూజ చేసుకున్నాము. అయితే నాకు మాత్రం మనుష్యులకు పూజ చేస్తుంటే చూడటం అదే మొదటిసారి. చాలా చిత్రంగా అనిపించింది. కానీ పూజ మొదలుపెట్టాక చక్కటి భావం కుదిరి భగవంతుడికి పూజచేస్తున్న భావన వచ్చింది.

అక్కడొక చిత్రమైన సంఘటన జరిగింది. ఆ వూరిలోనే విశ్వావధానులు అనే ఆయన వుండేవారు. ఆయన స్టేషన్ మాస్టర్. ఆయనకు ముందు రోజు కలలో ఒకాయన కనిపించి మా ఇంటికి వెళ్ళమని, అక్కడకి ఒకాయన వస్తారని, బాబా భజన చేస్తారనీ చెప్పారట! ఆ రోజు ఆయన మా ఇల్లు వెతుక్కుంటూ వచ్చారు. ఆక్కడ జరుగుతున్న పూజలో పాల్గొని చాలా సంతోషించారు. అందరమూ కలిసి పూజ్యశ్రీ మాస్టరుగారిని తీసుకుని వారి కోసం ఏర్పాటు చేసిన సత్రానికి వెళ్ళాము. సత్రంలో అయితే ఎక్కువమంది పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధిలో కూర్చొనవచ్చని అక్కడ ఆయనకు వసతి ఏర్పాటు చేశారు. అక్కడ అందరూ భక్తిశ్రద్ధలతో వారిని పూజించారు. పూజ్యశ్రీ మాస్టరుగారు సత్సంగం చేశారు.

మా ఇంట్లో మావారి అమ్మమ్మగారు వుండేవారు. ఆవిడకు మడి, ఆచారం చాలా ఎక్కువ. పూజలు చేసుకోవడం, పురాణాలు చదువుకోవడం వాటిల్లోనే వుండేవారు. ఆవిడకు పూజ్యశ్రీ మాస్టరుగారంటే చాలా ఇష్టం. ఇష్టం మాత్రమే కాదు, పూజ్యశ్రీ మాస్టరుగారిని భగవంతుడిలాగా భావించేవారు. చాలాసార్లు ఆవిడ, “ఇదిగోనే మాస్టరుగారు ఇక్కడ నిలుచున్నారు! అదిగో

అక్కడ వున్నారు!" అనేవారు కానీ మాకు కనిపించేవారు కాదు. పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా ఆవిడని చాలా ఆప్యాయంగా పలకరించేవారు. అలా వుండేది వారి ఇద్దరి అనుబంధం.

ఉలవపాడులో మేము వి.సి. వెంకటేశ్వర్లుగారి ఇంటిలో అద్దెకు వుండేవారము. అప్పటికి వాళ్లకు పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి తెలియదు. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు మా ఇంటికి వచ్చినపుడు వాళ్ళని కూడా రమ్మని పిలిచాము. భార్యాభర్తలు వచ్చి పూజ్యశ్రీ మాస్టరుగారిని దర్శించుకున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారి ఆప్యాయత, అనురాగాలకు పరవశులై వారు కూడా పూజ్యశ్రీ మాస్టరుగారిని సేవించుకునేవారు. ఆయనే, "భరద్వాజ మహారాజ్ కీ జై!" అని మొట్టమొదటిసారి కీర్తించినవారు.

పూజ్యశ్రీ మాస్టరుగారంటే ఒక సమ్మోహనం, ఒక ఆనందోత్సాహం. వారి సన్నిధి, సాహచర్యం మాలో ఎంతో ఉత్తేజాన్ని కలిగించేది. అవన్నీ అపూర్వ సంఘటనలు! ఎన్ని చెప్పినా తక్కువే! ఆ ప్రేమమూర్తికి హృదయపూర్వక నమస్సుమాంజలి ఘటిస్తున్నాము.

ఒంగోలుకు చెందిన శ్రీమతి రాధా మనోరంజని దేవి గారు

మాది ఒంగోలు. మావారు టీచర్. సుమారు 2007 లో వ్యక్తిగత కారణాలవలన మావారు నన్ను విడిచి మా అత్తగారింట్లోనే వుండేవారు. నాకు చాలా బాధగా వుండేది. ఇదివరకు నేను ప్రతిరోజూ బాబా మందిరానికి వెళ్ళేదానిని. కొంతకాలం నుంచి సమస్యలు ఎదుర్కొంటూ గుడికి వెళ్ళలేదు.

ఎందుకో ఒకరోజు వెళ్లాలనిపించి బాబా గుడికి వెళ్ళాను. అక్కడ పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు వ్రాసిన 'శ్రీ సాయి లీలామృతం' గ్రంథం చదవాలనిపించి కొనుక్కున్నాను. అక్కడివాళ్ళు అందరూ, "గురువారం నుంచి పారాయణ మొదలుపెట్టండి!" అని చెప్పారు. కానీ నేను కొనిన రోజునే అంటే బుధవారం రాత్రి 8-30కు ఆ గ్రంథాన్ని చదవడం మొదలుపెట్టాను. పుస్తకం ఒకసారి చదవడం పూర్తయింది.

ఒక వారం రోజుల తర్వాత నేను బాధపడుతూనే నిద్రపోయాను. అప్పుడు నాకొక స్వప్నం వచ్చింది. బాబా మావారి చెయ్యి పట్టుకుని వస్తున్నారు. కళ్ళు తెరిచి చూస్తే అది కల మాత్రమే. ఇలా అదే స్వప్నం తెల్లవార్లూ చాలాసార్లు

వచ్చింది. ఉదయం నిద్రలేచేటప్పటికి మావారు తనంతట తానే నా దగ్గరకు వచ్చేశారు. ఇది జరిగి సుమారు పన్నెండు ఏళ్ళు కావస్తోంది. శ్రీ సాయి లీలామృతము పారాయణ వల్ల నాకు ఇంత మంచి జరిగింది. ఇంతటి మహిమ గల పవిత్ర గ్రంథాన్ని మనకు అందించిన పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతో గొప్పవారు. ఆయనకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను?

నాకు ఎటువంటి సమస్య వచ్చినా ఒకసారి 'శ్రీ సాయి లీలామృతము' గ్రంథం పారాయణ చేసుకుంటే చాలా ప్రశాంతముగా వుంటుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారిని సశరీరంగా నేను దర్శించలేకపోయాను. ఒంగోలులో వుండి కూడా ఆయనను చూడలేకపోయానే అని చాలా బాధగా వుంటుంది. నేను వారిని దర్శించకున్నా, పూజించకున్నా వారు నా కుటుంబాన్ని నిలిపారు. ఆయన చేసిన మేలు నేనెన్నటికీ మర్చిపోలేను.

నాకు వారి ప్రతిరూపమైన పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించాలనిపించింది. ఒంగోలులోని పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వెళ్ళాను. కానీ పూజ్యశ్రీ అమ్మగారు హైదరాబాదులో వుంటున్నారని తెలిసింది. ఆమె దర్శనం నాకెప్పుడు కలుగుతుందో!

నాకు ఏ సమస్య ఎదురైనా బాబాను, పూజ్యశ్రీ మాస్టరుగారినీ ప్రార్థిస్తాను. ఆ సమస్యలు తీరిపోతాయి.

పూజ్యశ్రీ మాస్టరుగారి కృప వల్ల ఈ టెలిగ్రామ్ ఛానల్ గురించి తెలిసి వారు నా కుటుంబాన్ని నిలబెట్టి, నన్ను వెన్నంటి కాపాడుతున్న లీలను మీతో పంచుకుంటున్నాను.

బాబాకు, పూజ్యశ్రీ మాస్టరుగారికీ శతకోటి కృతజ్ఞతాభివందనాలు.

ఓం సంకటహర్తాయ నమః!

సికింద్రాబాదులో వుంటున్న శ్రీమతి కల్పనగారు

నేను సికింద్రాబాదులోని మహంకాళి గుడి ఎదురుగా వున్న చిన్న బట్టలకొట్టులో పనిచేస్తాను. రెండు నెలల క్రితం శ్రీమతి అరుణగారు అనే ఆవిడ ఒక ఫ్రాక్ కొనడానికి మా కొట్టుకి వచ్చారు. ఇది వరకు కూడా ఒకటి రెండు సార్లు వచ్చారు. నాకు ఆవిడతో బాగానే పరిచయం వుంది. ఆ రోజు ఆవిడ

వచ్చేసరికి దాదాపు సాయంత్రం 6 గంటలవుతోంది. ఒక ఫ్రాక్ బేరం చేశారు కానీ ఆ ఖరీదుకు నేను ఇవ్వనన్నాను. "సరేలే!" అని వెళ్ళిపోబోయారు. నేను మళ్ళీ వెనుకకు పిలిచి, "మీరు దీపాలు పెట్టగానే వచ్చారు. బేరం తిప్పి పంపకూడదు,తీసుకోండి!" అన్నాను.

నేను ఆ ఫ్రాక్ ప్యాకింగ్ చేస్తుంటే ఆవిడ నన్ను చూసి, "మీరు ఏదోలా వున్నారు. అంత రేటు పడకపోతే ఇవ్వద్దులెండి!" అన్నారు. "అబ్బే అదేమీ కాదండి! మనసు బాగోలేదు, అందుకే అలా వున్నాను" అన్నాను. వెంటనే ఆవిడ, "బాబాని నమ్ముకోండి, బాధలన్నీ పోతాయి!" అన్నారు. "నేను ఆయననే నమ్ముకుంటాను, అయినా నా బ్రతుకు ఇలాగే వుంది!" అన్నాను కొంచం విసుగ్గా. అప్పుడు ఆవిడ, "మీకు అభ్యంతరం లేకపోతే నాకు ఏమి జరిగిందో చెప్పండి!" అన్నారు. "ఏమి లేదండీ, అందరి ఇళ్లల్లో వుండేదే! నాకు, మా ఆయనకీ గొడవ జరిగింది. చెప్పాపెట్టకుండా ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. ఇప్పటికి 12 రోజులైంది. ఏమయ్యాడో తెలియదు. ఇద్దరు పిల్లలున్నారు. మాకు ఈ ఉద్యోగం ఒక్కటే ఆధారం. దాని గురించే బాధపడుతున్నాను" అన్నాను.

ఆవిడ ఒక నిమిషం ఆలోచించి, "శ్రీ సాయిలీలామృతం పారాయణ చేశారా?" అని అడిగారు. "ఒకసారి చదివాను" అని చెప్పాను. ఆవిడ వెంటనే తన సంచీలోనించి ఒక చిన్న పుస్తకం తీసి నాకు ఇచ్చి, "ఇది పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి అమ్మాయి వ్రాసిన 'సమర్ధ సద్గురువు' అనే గ్రంథం. దీనిలో పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి వుంటుంది. ఈయన కూడా బాబా అంతటి సమర్థుడే! నమ్మకం పెట్టుకుని ఎన్నిసార్లు వీలైతే అన్నిసార్లు ప్రతిరోజూ చదువుకోండి. కనీసం ఒకసారి అయినా చదవండి!" అని ఆ పుస్తకాన్ని నాకు ఇచ్చారు. నేను వారి అమ్మాయి పేరు చూసి, "వీళ్ళు ఎక్కడ వుంటారు?" అని అడిగాను. ఆమె, "నాగోలులోని జైపురికాలనీ" అని చెప్పారు. నేను వెంటనే, "మా అక్క అక్కడే వుంటుంది. తను టైలర్" అని చెప్పాను. "అలాగా!" అని, "ఈ పుస్తకం మాత్రం శ్రద్ధగా చదవండి!" అని చెప్పి వెళ్లిపోయారు.

ఆమె వెళ్ళాక ఆ పుస్తకం చదవడం మొదలు పెట్టాను. చాలా బాగా అనిపించి మళ్ళీ మళ్ళీ చదివాను --అంటే 4, 5 సార్లు చదివేశాను. ఆ రోజు రాత్రి 10 గంటల సమయంలో నాకు తెలిసిన వాళ్ళ దగ్గర నుంచి ఫోన్ వచ్చింది. మా ఆయన వాళ్ళ ఇంటికి వచ్చాడని, నా దగ్గరకు రావాలనుకుంటున్నాడనీ

చెప్పారు! నేనొక్కసారిగా ఆశ్చర్యపోయాను. కొంచెం తేరుకుని సరేనని చెప్పాను. అప్పుడు ఆలోచించాను. ఇన్నాళ్లూ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించనిది ఈ రోజు అప్రయత్నంగా మా ఆయన ఆచూకీ తెలిసింది. ఇదంతా ఆ పుస్తకం చదవడం వల్లే జరిగింది. 'ఈయనెవరో సామాన్యులు కారు!' అనిపించి అప్పుడు మనస్ఫూర్తిగా పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసుకున్నాను.

ఆ పుస్తకం చదువుతున్నప్పుడు నాకు ఒకటి అనిపించింది ----'ఈ గొడవలో నా తప్పు కూడా వుంది! మా ఆయనది మాత్రమే తప్పు కాదు. నేను సరిదిద్దుకోవలసినవి చాలా వున్నాయి' అని! అప్పుడే ఈ విషయం అరుణగారికి ఫోన్ చేసి చెప్పాలనుకున్నాను. ఇంటికి వచ్చాక చెబుదామని ఊరుకున్నాను. మర్నాడు ఉదయమే మా ఆయన మా ఇంటికి వచ్చారు! అప్పుడు ఆమెకి ఫోన్ చేసి సంతోషంగా ఈ విషయం చెప్పాను. పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి కరుణకు నాకెంతో కృతజ్ఞతగా అనిపించింది. మా అక్కకి కూడా ఫోన్ చేసి ఈ విషయం చెప్పాను. తనూ చాలా సంతోషించింది.

తరువాత తెలిసిన విషయాలేమిటంటే -- మా అక్కకి పూజ్యశ్రీ మాస్టరుగారి కుటుంబం అంతా తెలుసనీ, శిరిడిలో బాబా సమాధికి వస్త్రాలు ఆ కుటుంబం వారు మా అక్క చేతనే కుట్టించారనీ! జరిగినది అంతా ఒకసారి తలచుకుంటే -- నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు ఎవరో తెలియకపోయినా మా కొట్టుకి అరుణగారిని పంపించి, ఆ గ్రంథం రూపంలో నాదగ్గరికి వచ్చి నా కాపురాన్ని నిలబెట్టినందుకు వారికి పాదాభివందనములు !!

ఓం ఆర్తత్రాణపరాయణాయ నమః!

ఒంగోలులో వుంటున్న ఒక భక్తురాలు

మావారు చైన్ స్మోకర్. ఎప్పుడూ సిగరెట్ తాగుతూ వుండవలసిందే! నేను ఎన్నిసార్లు మానేయమని చెప్పినా వినేవారు కాదు. పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి దగ్గర ఎలాగైనా మావారు ఆ అలవాటు మానేలా అనుగ్రహించమని ప్రతిరోజూ మొరపెట్టుకునేదానిని. ఒకరోజు నేను పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధికి ప్రదక్షిణలు చేస్తున్నాను. మావారు సమాధి మందిరం గుమ్మం బయట నిలబడి వున్నారు. ఎలాగైనా సిగరెట్టు వెలిగించాలని ఆలోచిస్తున్నారట ఆయన.

వెనకనుంచి ఎవరో భుజం తడితే తిరిగి చూశారట. పూజ్యశ్రీ మాస్టరుగారు మావారి వెనుక నిలబడి, "కాల్చడం ఆపు! అమ్మాయి బాధపడుతుంటే అర్థం కావటం లేదా?" అన్నారట! మావారు తేరుకునే లోపే ఆయన ముందు నుంచి సమాధిలోకి వెళ్లిపోయారట! ఆయన ఒక్కసారిగా హడలిపోయారు.

కానీ ఈసారి గుడినుంచి బయటికి రాగానే మళ్లీ సిగరెట్ తాగాలని అనిపించింది. 'ఏదో నా భ్రమవలన ఇందాక అలా అనిపించి వుంటుందిలే!' అనుకుంటూ ఒక సిగరెట్ వెలిగించారు. అది చాలా చెడ్డ వాసన వేసింది! వెంటనే దానిని ఉమ్మేసి 'ఇదేదో పొరపాటున ఇలా వాసనగా వుందిలే!' అనుకుంటూ ఇంకొకటి వెలిగించారు. అది ఇంకా చండాలమైన కంపు కొట్టడంవలన దానినీ ఉమ్మేసి, 'అమ్మో, నిజంగానే పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను హెచ్చరించారు! అందుకే ఇలా జరిగింది' అని తెలుసుకున్నారు. అప్పటినుంచి సిగరెట్ కాల్చడం మానేశారు. అంతా పూజ్యశ్రీ మాస్టరుగారి దయే!

ఓం భక్త దోష సంస్కరణాయ నమః!

